క్లుప్తంగా

సందడి చేసిన పూర్వ విద్యార్థులు



తురువోలు హైస్కూలు హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

చీడికాడ: తురువోలు హైస్కూల్లో 2007–08 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమావేశంలో కలుసుకున్నారు. తమకు గతంలో విద్య నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పాఠశాలలో నిర్మిస్తున్న కళావేదికకు రూ. 25 వేల విరాళం అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా ఒకరి గురించి ఒకరు తెలుసుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అడవిరాజులుబాబు పండగ



ప్రత్యేక అలంకరణలో అడవిరాజులుబాబు

రావికమతం: మండలంలోని దొండపూడిలో గల అడవిరాజులుబాబు పండగను ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త చందక రాజుబాబు ఆధ్వర్యంలో ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ముగిసిన భీష్మ ఏకాదశి భజనలు



రామాలయంలో భజనలు చేస్తున్న భక్తులు

మాడుగుల: మండలంలోని జంపెన గ్రామంలో శనివారం ఉదయం ప్రారంభమైన ఏకాహం భజనలు ఆదివారం సాయంకాలం ముగిసాయి. సుమారు 30 ఏళ్ల నుండి రామాలయంలో భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గురువమ్మ ధర్మారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంపెన, ఓడపాడు శ్రీరామ భజన బృందాల సభ్యులు పాల్గొన్నారు. ఆదివారం ఆలయం వద్ద భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. గ్రామంలో గల మహిళలంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పుచ్చకాయలకు పెరిగిన డిమాండ్



కె.జె.పురంలో విక్రయిస్తున్న పుచ్చకాయలు

మాడుగుల రూరల్: వేసవి ప్రారంభంలోనే ఎండలు బాగా కాస్తున్నాయి. దీంతో పుచ్చకాయలకు డిమాండ్ పెరిగింది. బుచ్చెయ్యపేట మండలంలోని పలు గ్రామాల్లో పుచ్చకాయ సాగు చేస్తూ విరివిగా విక్రయిస్తున్నారు. సైజ్‌ను బట్టి రూ. 30 నుంచి రూ. 50, రూ. 70 వరకు విక్రయిస్తున్నారు. చిన్నచిన్న ముక్కలుగా కోసి ముక్క రూ. 10కి కూడా విక్రయిస్తున్నారు.

శరవేగంగా నూకాంబిక అమ్మవారి ఆలయ నిర్మాణం



నూకాంబిక అమ్మవారి ఆలయం

కె.కోటపాడు: ఆనందపురంలో నూకాంబిక అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామంలో అమ్మవారి ఆలయాన్ని గ్రామస్తులంతా ఐక్యంగా నిర్మించుకుంటున్నట్లు నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. సుమారు రూ.10 లక్షల నగదు సమీకరించుకుని ఈ నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరో నెల రోజుల్లో పనులు పూర్తవుతాయని వారు తెలిపారు.

గ్రీన్ క్లబ్ సభ్యుల కృషి అభినందనీయం

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఆవరణలో గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కొబ్బరి, మామిడి, ఉసిరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకుడు భీమరశెట్టి రాంకీ హాజరై మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్న గ్రీన్ క్లబ్ సభ్యులను అభినందించారు. సూర్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళీ, క్లబ్ గౌరవ అధ్యక్షుడు పెంటకోట ఉమామహేశ్వరావు పాల్గొన్నారు.

మృత్యు కుహారం

- ప్రమాదాలకు నిలయంగా ఏలేరు కాలువ సొరంగం
- బావిపై ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్స్ దొంగల పాలు
- పశువులు, సందర్శకులు పడితే ఆచూకీ గల్లంతే
- చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు



ఐరన్ గ్రిల్స్ శిథిలం కావడంతో ప్రమాదకరంగా మారిన ఏలేరు కాలువ సొరంగం బావి

నాతవరం: ఏలేరు కాలువ సొరంగం బావి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, ఇతర పరిశ్రమలకు తాగునీటి సరఫరా కోసం దీనిని ఏర్పాటు చేశారు. సుమారు 154 కిలోమీటర్ల పొడవున ఈ కాలువ నిర్మాణం జరిగింది. నాతవరం మండలం జిల్లేడుపూడి గ్రామం ఎత్తయిన ప్రాంతం కావడంతో ఏలేరు కాలువకు సొరంగం ఏర్పాటు చేశారు. సుమారు 280 అడుగుల లోతులో సొరంగం ద్వారా కాలువ తవ్వారు. సొరంగంలో కాలువ తవ్వడం కోసం జిల్లేడుపూడి గ్రామ సమీపంలో 15 అడుగుల వెడల్పు, 280 అడుగుల లోతులో బావి నిర్మించారు. సొరంగంలో కాలువ పనులు పూర్తి చేశాక ఎలాంటి ప్రమాదాలు జరగకుండా బావిపై ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. అయితే ఈ ఐరన్ గ్రిల్స్‌లో కొంత భాగాన్ని దొంగలు తస్కరించుకుపోగా మిగిలిన భాగం తుప్పు పట్టి శిథిలమైపోయింది. దీంతో బావిపై ఎలాంటి రక్షణ లేకుండా పోయింది. దీని వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ బావి నేలకు సమాంతరంగా, దట్టమైన తుప్పల మధ్యలో ఉండటంతో మేతకు వెళ్లిన పశువులు ప్రమాదశావత్తు జారి పడుతున్నాయి. ఇటీవల జిల్లేడుపూడి, గోవిందపురం, వెంకయ్యపాలెం గ్రామాలకు చెందిన పలువురు రైతుల పశువులు సొరంగం బావిలో పడి మరణించాయి. ఇలా తరుచూ జరుగుతున్న ప్రమాదాలపై రైతులు, స్థానికుల ఆందోళన మేరకు 2015లో అప్పటి జిల్లేడుపూడి సర్పంచ్ లాలం లోవ అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నర్సీపట్నం రూరల్ సీఐ షేక్ గఫూర్, నాతవరం తహసీల్దార్ పి. కనకారావు సొరంగం బావిని స్వయంగా పరిశీలించి ప్రమాదాలు జరగకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. దీంతో కొంత కాలం పాటు ప్రమాదాలు జరగలేదు. ఇప్పుడు మరల సొరంగం బావి వద్ద యథావిధిగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ బావిని చూసేందుకు వస్తున్న సందర్శకులు ఏమాత్రం ఆదమరిచి ఉన్నా ప్రమాదం జరుగుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సొరంగం బావిలో పడిన పశువులు, మనుషులను చూడటానికి గానీ, బయటికి తీయడానికి గానీ ఎలాంటి మార్గం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఏలేరు కాలువ సొరంగం బావిపై మరలా పటిష్టంగా ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరలో మండలాల వారీగా సమావేశాలు

గుడివాడ, ధర్మశ్రీ ప్రకటన



వడ్డాదిలో అనుచరులతో గుడివాడ అమర్, ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: చోడవరం నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల కార్యకర్తలు, నాయకులతో త్వరలో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంటరీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ తెలిపారు. ఆదివారం బుచ్చెయ్యపేట మండలం వడ్డాది, పీపీ అగ్రహారం తదితర గ్రామాల్లో జరిగిన కార్యకర్తలు, అనుచరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలు, ప్రజలకు మంచి జరిగేలా చర్యలు చేపట్టారన్నారు. జగనన్న సంకల్పంతో త్వరలోనే చోడవరం, రావికమతం, బుచ్చెయ్యపేట, రోలుగుంట మండలాల్లో కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి కార్యకర్తల అభీష్టం మేరకు పని చేస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అందించకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసం, అరాచక పాలనపై ప్రజలతో కలిసి నిలదీసేలా ప్రణాళిక తయారు చేశామన్నారు. మండలాల వారీగా ఏర్పాటు చేసే సమావేశాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, పార్టీ పార్టీ అధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, నాయకులు ఎస్ఎస్ఎన్ రెడ్డి, దొండా శ్రీరామమూర్తి, ముచ్చకర్ల శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణ స్వామి

మాడుగుల రూరల్: మండలంలోని వి.వి. అగ్రహారంలో గల శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారి కల్యాణం ఆదివారం రాత్రి నిర్వహిచారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త దొండా వరహాలుదొర (కుమార్) దంపతుల ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిశోర్‌కుమార్ సారధ్యంలో నిర్వహించిన ఈ వేడుకలు 13వ తేదీ వరకు జరుగుతాయని ప్రధాన అర్చకులు తెలిపారు. ఉత్సవాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



ఎస్‌ఐ రామారావు

గొలుగొండ: గ్రామ దేవతల పండగల సందర్భంగా ఎక్కడైనా కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రామారావు తెలిపారు. ఏటిగైరంపేట గ్రామ పంచాయతీలో మంగళవారం తలుపులమ్మ తల్లి పండగ సందర్భంగా ఈ పంచాయతీ శివారు ప్రాంతాల్లో కోడి పందాలు నిర్వహించడం కోసం కొంత మంది పక్కా ఏర్పాట్లు చేయగా శనివారం సాయంత్రం దాడులు చేసి పందాలు నిర్వహించకుండా చర్యలు చేపట్టామన్నారు. అలాగే ఆదివారం గొలుగొండ-రోలుగుంట మండలాల సరిహద్దుల్లో పందాలు నిర్వహించనున్నట్లు వచ్చిన సమాచారంతో జిల్లా, డివిజన్, గొలుగొండ పోలీసులు అప్రమత్తం అయ్యారని తెలిపారు. దీంట్లో భాగంగా ఆదివారం గొలుగొండ మండల సరిహద్దులైన ముంగర్లపాలెం, సీతకండి, కోదులపాలెం, రామన్నపాలెం ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేసి కోడిపందాల నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే సోమ, మంగళవారాల్లో కూడా నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

మాజీ డీసీసీబీ డైరెక్టర్ చిందొర మృతి



బండారు చిందొర (ఫైల్)

కె.కోటపాడు: గొండుపాలెం గ్రామానికి చెందిన బండారు వెంకన్నపాత్రుడు (చిందొర, 75) అనారోగ్యంతో ఆదివారం ఇంటి వద్ద మృతి చెందారు. అజాత శత్రువుగా ఆయనకు మంచి పేరుంది. ఆయన గతంలో చౌడువాడ పీఏసీఎస్‌కు మూడు సార్లు అధ్యక్షునిగా, ఒక పర్యాయం డీసీసీబీ, డీసీఎంఎస్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థకు రెండు పర్యాయాలు డైరెక్టర్‌గా పని చేశారు. ఈయన భార్య బండారు నారాయణమ్మ గతంలో కాంగ్రెస్ పార్టీ నుండి జెడ్పీటీసీగా గెలుపొందారు. చిందొరకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నేడు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్య మేఘన

మాడుగుల రూరల్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పాఠశాలలు, అంగన్‌వాడీ, కళాశాల విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాద్‌పాత్రుడు ఆదివారం తెలిపారు. 19 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారికి సోమవారం మధ్యాహ్నం భోజనం అనంతరం ఒక మాత్ర వేస్తామని తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో 6,129 మందికి ఈ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. కింతలి పీహెచ్‌సీ పరిధిలో ఈ మాత్రలు పంపిణీ చేస్తామని వైద్యాధికారి కె.ఎం. నాయుడు తెలిపారు.

డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలి..

దేవరాపల్లి: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ.పూజ్య మేఘన కోరారు. చిన్నారుల్లో నులిపురుగులను నివారించడమే ధ్యేయంగా పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలల్లోను విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ చిన్నారులకు సోమవారం అల్బెండాజోల్ మాత్రలు మింగిస్తామన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు.

రోడ్డుపై ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగింపజేస్తున్న సీఐ గోవిందరావు, సిబ్బంది

నర్సీపట్నం: ఫుట్‌పాత్ దాటి రోడ్డు మీదకి వచ్చిన ఆక్రమణలను పోలీసులు ఆదివారం తొలగించారు. అబిద్ సెంటర్ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ఉన్న ఆక్రమణలను సీఐ గోవిందరావు సమక్షంలో పోలీసులు తొలగింపజేశారు. ఫుట్‌పాత్ దాటి రోడ్డు మీదకి దుకాణాలు విస్తరించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. ఫుట్‌పాత్ దాటి దుకాణాలు వేస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ వ్యాపారులను హెచ్చరించారు.

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



విద్యుత్ వెలుగుల్లో ప్రకాశిస్తున్న నూతనంగా నిర్మించిన ఆలయం

మాకవరపాలెం: తామరంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు గొంతిన హరిబాబు తెలిపారు. ఈ గ్రామంలో గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షలతో ఆంజనేయ స్వామి ఆలయం నిర్మించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్టు హరిబాబు తెలిపారు. ఆదివారం ఆలయంలోని పంచలోహ విగ్రహాలను గ్రామంలో కోటాటం, భజనల నడుమ ఘనంగా ఊరేగించారు. ప్రతిష్ఠ అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించాలని కోరారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిమజ్జనోత్సవం



శారదా నదిలో గౌరమ్మ నిమజ్జనం

కశింకోట: స్థానిక శివాలయం వద్ద వెలసిన గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) నిమజ్జనోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గౌరమ్మ విగ్రహాన్ని రథంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. యువకులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొని రథం లాగారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. గౌరమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు గవరపేట మధ్య వీధి మీదుగా పెద్ద గుమ్మం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆర్కెస్ట్రాతో పాటు సంప్రదాయ డప్పులతో ఊరేగించారు. మహిళలు రథం వెంట భక్తి పాటలు పాడారు. అనంతరం గౌరమ్మకు వేద మంత్రాల నడుమ సంప్రదాయంగా పూజలు జరిపారు. మృదంగ వాయిద్యకారుడు సిరిపల్లి నరసింగరావును ఉత్సవ కమిటీ తరఫున సత్కరించారు. అనంతరం శారదా నదిలో ఉత్సవ విగ్రహాలను నిమజ్జనం చేశారు. శనివారం రాత్రి నిర్వహించిన డాన్స్ బేబీ డాన్స్, బుర్ర కథలు ఆహుతులను అలరించాయి. ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీకృష్ణ, వేగి దొరబాబు, కోయిలాడ నాగు, పెంటకోట తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

సరుగుడు జలపాతం వద

సండే సందడి



నాతవరం : సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది, జలపాతం వద్ద నీటిలో జలకాలు ఆడేందుకు సందర్శకులు పోటీ పడ్డారు. అనకాపల్లి, కాకినాడ జిల్లా నలుమూలలు నుంచి వాహనాలపై అధికంగా సందర్శకులు రావడంతో జలపాతం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు కోలాహలం కన్పించింది, ఆటపాటలతో సందర్శకులు కాలక్షేపం చేసి మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. సెల్ఫీలతో సందడి చేశారు. అదే విధంగా తాండవ రిజర్వాయర్‌ను తిలకించేందుకు సందర్శకులు విచ్చేసారు.

క్వారీ లారీలతో రహదారులు శిథిలం



శరభవరం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రోలుగుంట: మండలంలో బుచ్చింపేట, వడ్డిప, గుర్రంపేట, గొల్లపేట గ్రామాల రోడ్లు నల్లరాయి క్వారీల వల్ల ధ్వంసం అవుతున్నాయని ప్రజలు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. వీరికి సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. మండలంలో శరభవరం పంచాయతీ రెవెన్యూ పరిధిలో ఎల్. రాజు పేరు మీద 40 క్వారీలకు అనుమతులు ఇచ్చారు. వీటికి ఆనుకుని పచ్చని పొలాలు, మధ్యలో చెరువులు కూడా ఉన్నాయి. ఈ క్వారీల బ్లాస్టింగ్ వల్ల భారీ శబ్దాలు ఉత్పన్నమై రాజన్నపేట మీదుగా ఆర్ల పంచాయతీకి వెళ్లాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సీపీఎం నాయకులు తెలిపారు. అలాగే క్వారీ లారీలు తిరగడం వల్ల రోడ్లు శిథిలమవుతున్నాయని తెలిపారు. తక్షణమే భారీ వాహనాలను నిలుపుదల చేయాలని ప్రజలు, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా ఎం. కోడూరు మోదమాంబ అమ్మవారి తీర్థం



ఎం. కోడూరు మోదమాంబ సన్నిధిలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



పందెంలో దౌడు తీస్తున్న గుర్రం

మాడుగుల రూరల్: ఎం. కోడూరు గ్రామ ఇలవేల్పు మోదకొండమ్మ తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని పూజలు చేశారు. తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి గుర్రం పోటీలు, ఎడ్ల పందాలు, ఉత్తరాంధ్ర మహిళా ఆహ్వాన కబడ్డీ పోటీలు నిర్వహించారు. మహిళా కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. స్థానిక సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, మాడుగుల పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, దేవరాపల్లి మండల పార్టీ అధ్యక్షుడు బూరె బాబూరావు, పోతిన జగదీష్ తదితరులు బూడితో పాటు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు పాతవలసలో మరిడిమాంబ అమ్మవారి తీర్థం..

కె.కోటపాడు: పాతవలసలో సోమవారం మరిడిమాంబ అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు సర్పంచ్ జామి శ్రావణ్ తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామని, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

మాజీ సర్పంచ్ అప్పారావు కుటుంబానికి పరామర్శ



అప్పారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్ తదితరులు

గొలుగొండ: పాత కృష్ణదేవిపేట మాజీ సర్పంచ్ పందిరి అప్పారావు కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పరామర్శించారు. ఇటీవల అప్పారావు మృతి చెందడంతో శనివారం పెద్దకర్మ నిర్వహించారు. పాతకృష్ణదేవిపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ పార్టీకి ఎనలేని సేవలందించిన అప్పారావుకు ఘన నివాళులు అర్పించారు. అప్పారావు పెద్ద కుమారుడు పందిరి సత్యంనాయడు ప్రస్తుతం సర్పంచ్‌గా ఇదే పంచాయతీలో కొనసాగుతున్నారు. అప్పారావు కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని గణేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జడ్పీటీసీ సభ్యుడు సుర్ల గిరిబాబు, జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా జనుము పంట



ముషిడిపల్లిలో సాగులో ఉన్న జనుము పంట

దేవరాపల్లి: మండలంలోని పచ్చి రొట్ట ఎరువుగా వినియోగించే జనుము పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. దేవరాపల్లి, వాకపల్లి, చేనులపాలెం, ముషిడిపల్లి, యండపల్లిపాలెం, ఎ.కొత్తపల్లి తదితర గ్రామాల్లో సుమారు 50 ఎకరాలకు పైబడి జనుము సాగులో ఉంది. పంట వేసిన 30 నుంచి 45 రోజుల తర్వాత ఈ పంటను భూమిలో కలియదున్నాలి. తద్వారా భూమి సారవంతమవుతుంది. సదరు భూముల్లో సాగు చేసే పంటలకు రసాయనిక ఎరువులు వేయకుండానే పంటు ఏపుగా ఎదుగుతుంది. ఈ నేపథ్యంలోనే రైతులు జనుము పంట సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే ప్రస్తుతం సాగులో ఉన్న జనుము పంట పూత దశలో ఉంది. పసుపు పూలతో కనువిందు చేస్తున్న జనుము తోటలో ఆహ్లాదకరంగా దర్శనమిస్తోంది. దీంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న ప్రజలు, ప్రయాణికులు జనుము తోటల్లో సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.


భక్తిశ్రద్ధలతో సూర్యార్చన



సూర్య నమస్కారాలు చేస్తున్న పురోహితులు

నర్సీపట్నం: స్థానిక పురోహితులు, అర్చకులు శారదా స్కూల్ ప్రాంగణంలో సూర్య నమస్కార సహిత సౌర యోగం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏకకాలంలో 12 మంది రుత్వికులు సూర్య అర్చన చేసి ప్రదక్షిణగా మాఘ మాస ఆదివారం సూర్య నమస్కారాలు చేశారు. ఈ కార్యక్రమంలో వంద మంది దంపతులు పాల్గొని గణపతి పూజ చేసి, శ్రీసూర్యనారాయణ స్వామి వారికి అర్చన చేశారు. అనంతరం జరిగిన సౌర యోగంలో పాల్గొని హోమ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సీహెచ్ పద్మావతి, ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

ఎరుకునాయుడు మృతికి సంతాపం



ఉండూరు ఎరుకు నాయుడు (ఫైల్)

మాడుగుల: మండలంలో పొంగలిపాక గ్రామానికి చెందిన వార్డు మెంబరు నాగమణి భర్త, ఉండూరు ఎరుకునాయుడు (45) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. అతను గ్రామంలో సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అతని దహన సంస్కారాలు సోమవారం ఉదయం పొంగలిపాకలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.